



సభలో చంద్రబాబు అభివాదం

విజయం మనదే!

విల్లును ఎక్కుపెట్టిన చంద్రబాబు





బాబుకు స్వాగతం పలుకుతున్న వంగలపూడి అనిత, యనమల, రాజప్ప



బహిరంగ సభలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చంద్రబాబు



సభలో బొకే అందిస్తున్న కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని



సభలో చంద్రబాబుతో రాజేష్ మహాసేన, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల



చంద్రబాబుకు పూలమాల వేస్తున్న యనమల దివ్య, శివరామకృష్ణన్

- రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే
- వైసీపీ అరాచకాలకు ప్రజలు ముగింపు పలకడం ఖాయం
- కాకినాడ జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తా
- ఏలేరు ఆధునికీకరణ, పురుషోత్తపట్నంతోపాటు ఎత్తిపోతల పథకాలను బాగుచేస్తా
- తునిలో రా..కదలిరా బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు
- జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు, దాడిశెట్టి రాజా అవినీతిపై ధ్వజం
- మంచితనానికి, మర్యాదలకు తూర్పుగోదావరి పెట్టింది పేరని కొనియాడిన చంద్రబాబు
- తుని సభకు వేలల్లో జనం పోటెత్తడంతో చంద్రబాబు ఉబ్బితబ్బిబ్బు

"వైసీపీ అరాచకాలతో ప్రజలు విసుగెత్తిపోయారు. ఆ పార్టీకి బుద్ధి చెప్పడానికి ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే" అని టీడీపీ అధినేత చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసి పూర్వవైభవం తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. తునిలో బుధవారం నిర్వహించిన రా..కదలి రా!.. సభలో పాల్గొని చంద్రబాబు గంటన్నరసేపు ప్రసంగించారు. సాయత్రం 4.15 గంటలకు హెలీకాప్టర్‌లో తునికి చేరుకున్న చంద్రబాబు 5.15 గంటలకు సభా వేదికపైకి వచ్చారు. అప్పటికే వేలల్లో హాజరైన జనాన్ని చూసి ఉబ్బితబ్బిబ్బయ్యారు. జన సందోహాన్ని చూస్తుంటే టీడీపీ గెలుపు కనిపిస్తోందన్నారు. చెంతనే ఉన్న సముద్రం పొంగిందా అన్నతరహాలో వచ్చిన జనాలను చూస్తే చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా గొప్పదనాన్ని చంద్రబాబు వివరించారు. తూర్పుగోదావరి జిల్లా అంటే మంచితనానికి, మర్యాదలకు పెట్టింది పేరు అని కొనియాడారు. అలాగే వైసీపీ నేతల అరాచకాలను మరోసారి ఆయన ఎండగట్టారు. జిల్లాలో ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పిన చంద్రబాబు.. సంప్రదాయాలకు చిహ్నమైన కోడి పందాలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయని, అయితే హద్దుల్లో ఉంటూనే ఆడుకోవాలని సరదాగా సూచించారు.

కాకినాడ(ఆంధ్రజ్యోతి)/తుని రూరల్, జనవరి 10 :

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు, ఓ మంత్రికి సీట్లు మార్చిన జగన్.. కాకినాడ సిటీ, కొత్తపేట, అనపర్తి ఎమ్మెల్యేలను ఎందుకు మార్చరని చంద్రబాబు ధ్వజమెత్తారు. మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబుల అవినీతిపై విరుచుకుపడ్డారు. బుధవారం తునిలో నిర్వహించిన రా..కదలి రా..! సభకు వేలల్లో జనం హాజరవడంతో అంతా పసుపుమయం అయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలతో పండగ వాతావరణం సంతరించుకుంది. సాయంత్రం 5.15కు చంద్రబాబు బహిరంగ సభ వేదికపైకి రాగానే చప్పట్లు, కేరింతలతో టీడీపీ, జనసేన నేతలు, కేడర్ స్వాగతం పలికారు. వేలల్లో హాజరైన జనాలను చూసిన చంద్రబాబు ఆప్యాయతలకు జిల్లా మారుపేరు అని కొనియాడారు. నీతినిజాయితీకి జిల్లా పెట్టింది పేరన్నారు. పౌరుషంగా ఒక్కమాట కూడా మాట్లాడరని అన్నారు. మంచినీళ్లు ఇస్తే కొబ్బరి నీళ్లు ఇక్కడి ప్రజలు ఇస్తారన్నారు. చెంతనే అన్నవరంలో నిత్యం పూజలు, వ్రతాలతో ఈ ప్రాంతం మార్మోగుతుందని వివరించారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, మంత్రి దాడిశెట్టి రాజా అక్రమాల రాజా అని ధ్వజమెత్తారు. అక్రమ సంపాదనతో ఒకచోట 132 ఎకరాలు, మరోచోట రౌతులపూడిలో 72 ఎకరాలు కొన్నారన్నారు. ఇలాంటి వసూలు రాజా అయిన మంత్రి రాజా ఎందుకు టిక్కెట్ మార్చే విషయంలో కనబడలేదని జగన్‌ను ప్రశ్నించారు. మరో ఎమ్మెల్యే ద్వారంపూడి అవినీతికి ద్వారాలు తెరిచారని, దందాల్లో ఈయన హీరో అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్‌ను నోటికివచ్చినట్టు తిట్టడంలో ద్వారంపూడి మీరిపోయాడన్నారు. ఇలాంటి నేతలు తిన్నదంతా తిరిగి కక్కిస్తానని హెచ్చరించారు. జగన్‌కు ద్వారంపూడి బినామీ అని, బియ్యంలో ఈయన కోట్లు గడించారన్నారు. జిల్లాలో ఏ అవినీతి జరిగినా దీనికి కేంద్ర బిందువు ద్వారంపూడేనన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు మెక్కడంలో స్పీడ్‌గా ఉన్నారని, ఒకప్పుడు ఈయన జగన్‌ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి ఇప్పుడు తెగ పొడుగుతున్నారన్నారు. బతకనేర్చిన కన్నబాబు అవినీతిలో లెక్కలేనంతగా సంపాదించాడని ఆరోపించారు. జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం ఎమ్మెల్యేలను జగన్ మార్చేశారని, ఓ మంత్రిని జిల్లా దాటించేశారన్నారు. ప్రజలు కూడా సీఎం జగన్‌ను ఇంటికి పంపించడం ఖాయం అన్నారు. వైసీపీ పాలనలో జిల్లా సాగునీటి రంగం తీవ్రంగా దెబ్బతిందని ధ్వజమెత్తారు. టీడీపీ వచ్చాక ఏలేరు ఆధునికీకరణ, పురుషోత్తపట్నం, ఎత్తిపోతల పథకాలను తిరిగి గాడినపెడతామని ప్రకటించారు. జిల్లాలో సముద్రజల కాలుష్యంపై మత్స్యకారులు ఫిర్యాదుచేశారని, ఆ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో తీరంతోపాటు సెజ్, రెండు పోర్టులు ఉన్నాయని, పెట్రోకాంప్లెక్స్ కూడా వస్తే పారిశ్రామికంగా వృద్ధి చెందుతుందన్నారు. పర్యాటకరంగాన్ని కూడా ప్రోత్సహించి జిల్లాకు పూర్వవైభవం తెస్తానన్నారు. కాగా చంద్రబాబుకు టీడీపీ నేతలు వెండి గద, బాణం అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, బండారు సత్యనారాయణ, రాజప్ప, గొల్లపల్లి, ఎమ్మెల్యే గోరంట్ల, మాజీ ఎమ్మెల్యేలు నెహ్రూ, వనమాడి, వర్మ, రామకృష్ణారెడ్డి, వంగలపూడి అనిత, బండారు సత్యానందం, దాట్ల బుచ్చిబాబు, పిల్లి అనంతలక్ష్మి, జిల్లా పార్టీ అధ్యక్షుడు నవీన్, ప్రత్తిపాడు, తుని, రాజానగరం ఇన్‌చార్జులు వరుపుల సత్యప్రభ, దివ్య, బొడ్డు వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కటకంశెట్టి బాబి, పేరాబత్తుల రాజశేఖర్, వాసిరెడ్డి ఏసు దాసు, టీడీపీ సీనియర్ నేత గుణ్ణం చంద్రమౌళిలు పాల్గొన్నారు.

మూడు నెలల్లో దశ, దిశ చూపిస్తాం

సూర్యుడు తూర్పున ఉదయించి ఏ విధంగా అందరికీ వెలుగునిస్తాడో.. అలా టీడీపీ, జనసేన కూడా మూడు నెలల్లో ప్రభుత్వ బాధ్యత తీసుకుని దశ, దిశ చూపిస్తామని చంద్రబాబు స్పష్టంచేశారు. ఒక విజనరీ ఉండాలి. ఆ రోజుల్లో కాటన్.. ధవళేశ్వరం బ్యారేజీ కట్టాడు. అతడు విదేశీయుడైనా గోదావరి జిలాల్లో ఏ మూలకు వెళ్లినా అయన విగ్రహాలు పెట్టారు. అదీ మీ మంచితనం. మీకు మేలు చేస్తే అలా చూసుకుంటారు. కానీ ఇక్కడ వైసీపీ నేతలు మెక్కిందంతా కక్కిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. కాగా జగన్ ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన మోసపూరిత హామీల వీడియోను సభా వేదికపై భారీ స్క్రీన్‌పై చంద్రబాబు ప్రదర్శించారు. మద్య నిషేధం చేస్తానని, సీపీఎస్ వారంలోనే రద్దు చేస్తానని, ప్రత్యేక హోదా తీసుకువస్తానని, పోలవరం 2021, 2022, 2023, 2025కల్లా పూర్తిచేస్తానని జగన్ ప్రసంగాలను ప్రదర్శించి.. బాబు ప్రశ్నల వర్షం కురిపించారు. జై చంద్రబాబు, జై పవన్‌కల్యాణ్.. సైకో పోవాలి-సైకిల్ రావాలంటూ సభా ప్రాంగణం నినాదాలతో హోరెత్తింది. చంద్రబాబు ప్రసంగానికి కార్యకర్తలు ఉత్సాహంతో స్పందించారు.





తునిలో జరిగిన రా.. కదలి రా..! బహిరంగ సభకు హాజరైన అశేష జనావళి.. సభలో వేదికపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జులు, ఇతర నేతలు ఉన్న దృశ్యం

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిన జగన్

వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. టీడీపీ పాలనలో దేశంలో రాష్ట్రం అభివృద్ధి మొదటి 5 స్థానాల్లో ఉండగా వైసీపీలో చివరి 5 స్థానాల్లోకి దిగజారింది. రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంపదను సృష్టించి రాష్ట్రాన్ని గాడినపెట్టగల సమర్థుడు చంద్రబాబు. భవిష్యత్ తరాలకు టీడీపీ, జనసేన ప్రభుత్వం ఎంతో అవసరం.

- యనమల రామకృష్ణుడు,
రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు



బటన్‌నొక్కి జగన్‌ను ఇంటికి పంపిద్దాం

జనాలను మోసం చేస్తున్న జగన్‌ను ఈవీఎం బటన్ నొక్కి, ఇంటికి పంపిద్దాం. రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన విజయాన్ని కోరుకుంటున్నారు. ఇరుపార్టీల మైత్రితో ఘన విజయం సాధిస్తాం.

- నిమ్మకాయల చినరాజప్ప
పెద్దాపురం ఎమ్మెల్యే

జనసేన, టీడీపీ సంయుక్త పోరాటం

జనసేన, టీడీపీ సంయుక్త పోరాటంతోనే వైసీపీ ఓటమి సాధ్యం. 45 వసంతాల రాజకీయ చరిత్ర.. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు, మంచి స్టార్డమ్ ఉన్న జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లకు పదవులు ముఖ్యంకాదు.. రాష్ట్ర ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసమే ఇరుపార్టీలు ఒక్కటయ్యాయి. రాష్ట్ర సైకో పాలనను అంతం చేసేందుకు చంద్రబాబు, పవన్ కలయిక తప్పనిసరి. రాష్ట్ర భవిష్యత్ కోసమే జనసేన అధినేత పొత్తు పెట్టుకున్నారు. ఇరుపార్టీలు సమన్వయంతో పనిచేసి సుపరిపాలనకు నాంది పలుకుదాం.

- కందుల దుర్గేష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన ఇన్‌చార్జి

కీలక సమయంలో అంకితభావంతో పనిచేయండి

» ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్

కాకినాడ క్రైం, జనవరి 10: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కీలక సమయం ఆసన్నమవుతున్న తరుణంలో పోలీస్ అధికారులనుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అప్రమత్తంగా ఉండి అంకితభావం,పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ సూచించారు. ఎన్నికల విధుల సన్నద్ధత, కార్యాచరణల పర్యవేక్షణలో భాగంగా ఆయన కాకినాడ సబ్ డివిజన్ పరిధిలోని కాకినాడ అర్బన్ శాంతిభద్రతల(లాఅండ్ ఆర్డర్) పోలీస్‌స్టేషన్‌లను బుధవారం పరిశీలించారు. కాకినాడ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, పోర్ట్, ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌ల్లో రాబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సజావుగా పూర్తి చేసే అంశాలకు సంబంధించి నిర్దేశించుకున్న రోజువారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ లక్ష్యాల నివేదికలను ఎస్‌హెచ్‌వోలతో సమీక్షించారు. ప్రతి ఎస్‌హెచ్‌ఓ సిబ్బందితో కలిసి సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సంబంధిత ప్రాంత ప్రజలతో మమేకమై సత్సంబంధాలను మెరుగు పర్చుకుని అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలని, ప్రజాశాంతికి భంగం కలిగించేలా వ్యవహరించేందుకు అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలపై పటిష్ట నిఘా ఉంచి బైండోవర్‌లను విస్తృతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

జీజీహెచ్ గేటు బయట శానిటేషన్ వర్కర్ల ఆందోళన

జీజీహెచ్(కాకినాడ), జనవరి 10: మున్సిపల్, అంగన్‌వాడీ, సమగ్ర శిక్షాభియాన్ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్ శానిటేషన్ వర్కర్ల ఆధ్వర్యంలో గేటువద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ కొవిడ్ సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి మున్సిపల్, శానిటేషన్ వర్కర్లు సేవలందించామన్నారు. తమ సేవలకు కనీసం ఒక నెల జీతం కూడా అదనంగా వేయలేదన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మలక వెంకటరమణ, శేషు, రమేష్, వాసు, పుష్ప, తలుపులమ్మ, రమణమ్మ, శ్రీకాంత్, వసంత్ పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రివద్ద ఆందోళన నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్లు

డిమాండ్లు నెరవేర్చాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

కాకినాడ సిటీ, జనవరి 10: తమ డిమాండ్లు పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 22వ రోజుకు చేరిన సందర్భంగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నగరంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. భానుగుడి సెంటర్‌నుంచి మెయిన్‌రోడ్, దేవాలయంవీధి, కలెక్టరేట్ మీదుగా ధర్నాచౌక్ శిబిరం వరకు ఈ ర్యాలీ కొనసాగింది .ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.చంటిబాబు మాట్లాడుతూ మంత్రితో చర్చలు విఫలమైతే నిరవధిక సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జేఏసీ జిల్లా కార్యదర్శి సత్యనాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు ఎంవీ సాయికిరణ్, ఎ.లోవరాజు, పీవీవీ మహాలక్ష్మి, ఎం.రాధాకృష్ణ, సహాయ కార్యదర్శులు కె.చంద్రశేఖర్, జి.నారాయణ, ఎంబీ సాల్మన్, జిల్లా కోశాధికారి పి.రాజు, కె.శ్రీనివాస్, ఎం.గంగాధర్ నాయకత్వం వహించారు.

30వరోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

కాకినాడ సిటీ, జనవరి 10: కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ వర్తింపజేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని తదితర డిమాండ్లతో కాకినాడలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 30వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌వద్ద ప్రారంభించిన 24గంటల రిలేదీక్షలు 4వరోజుకు చేరాయి. శిబిరంవద్ద ప్రత్తిపాడు, శంఖవరం అంగన్‌వాడీ ప్రాజెక్టుల నాయకురాళ్లు అల్లాడి లక్ష్మి, కాకరపల్లి సునీత, గెద్దం బుల్లమ్మ మాట్లాడారు. అవసరమైతే మరో 30రోజులు సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని, డిమాండ్లు సాధించుకునే వరకు వెనుకడుగు వేసేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 4వ రోజు దీక్షల్లో కానూరి హేమలత, టి.నాగసత్యవతి, ఎన్.అమలావతి, పి.గంగాభవాని, బి.ఉదయగంగ, బి.రత్నకుమారి, బి.సత్యవేణి పాల్గొన్నారు. అంగన్‌వాడీల దీక్షలకు పలు సంఘాలు మద్దతుగా నిలిచాయి.



సమ్మె శిబిరంలో దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలు

కేజీ బేసిన్ ద్వారా అధిక మొత్తంలో ఉత్పత్తులు

ఓఎన్జీసీ ఈడీ అమిత్ నారాయణ్



అల్లవరం, జనవరి 10: కృష్ణా-గోదావరి బేసిన్ పరిధిలో చమురు, సహజవాయివు ఉత్పత్తులు గణనీయంగా పెరగడంతో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్‌నారాయణ్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరానికి బుధవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఓఎన్జీసీ కేజీ బేసిన్ అధిక ఉత్పత్తుల సాధనపై ప్రధాని నరేంద్రమోదీ అభినందించారన్నారు. ఈస్టన్ ఆఫ్‌షోర్ బావుల నుంచి అత్యధిక ఉత్పత్తులు సాధిస్తూ గడిచిన ఇరవై ఏళ్లలో అగ్రస్థానంలో నిలిచిందని, తద్వారా దేశానికి డొమెస్టిక్ గ్యాస్ పది శాతం దాటి అందిస్తున్నామన్నారు. కోనసీమ జిల్లా తాటిపాక రిఫైనరీ, నాగాయిలంక నుంచి 60 శాతం ఉత్పత్తులు సాధించడం గర్వకారణమన్నారు. ఆన్‌షోర్ బావుల ద్వారా రోజుకు 650 టన్నుల క్రూడాయిల్, 21 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. ఈ ఏడాది చివరికి ఇది 750 టన్నులకు పెరుగుతుందన్నారు. తమ కార్యకలాపాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ఏడాదికి రూ.600 కోట్లు రాయల్టీగా చెల్లిస్తున్నామన్నారు. సీఎస్ఆర్ నిధులతో పలు సదుపాయలు కల్పిస్తున్నామన్నారు. ఓఎన్జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ చమురు ఉత్పత్తుల్లో అగ్రగామిగా నిలిచి సీఎస్ఆర్ నిధులు ఎక్కువగా ఇచ్చేస్థాయికి చేరుకుందని ఈడీ అమిత్‌నారాయణ చెప్పారు.

జైళ్లశాఖ డీఐజీ ప్రత్యేక పూజలు


స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం, జనవరి 10 : రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఏపీఆర్వో ఎం.గణపతిరావు తదితరులున్నారు.

తప్పించుకుని తిరుగుతున్న నేరస్థుల అరెస్టు


గంజాయి(ఫైల్)

జగ్గంపేట, జనవరి 10: జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన ఒక గంజాయి రవాణా కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని, మరో ముగ్గురు కోసం గాలిస్తున్నట్లు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. జగ్గంపేట సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2021 డిసెంబరులో విశాఖపట్నం ఏజెన్సీలో గల ధారకొండ గ్రామం నుంచి మహారాష్ట్రకు 152 ప్యాకెట్లతో ఉన్న 750 కిలోల గంజాయిని తరలిస్తున్న స్కార్పియో వాహనం కత్తిపూడి వద్ద పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పలు దారులలో తిప్పితిప్పి చివరకు కిర్లంపూడి మండలం తామరాడ వద్ద ఏటిగట్టున గంజాయి ప్యాకెట్లుతో వదిలేశారని తెలిపారు. పోలీసులను నుంచి తప్పించుకునే ప్రయత్నంలో తమ వాహనంతో స్కూటీపై వెళుతున్న ఒక వ్యక్తిని గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో ఢీ కొట్టడంతో అతను మృతి చెందాడని తెలిపారు. ఈ కేసు అప్పట్లో సంచలనం అయిందన్నారు. దీనికి సంబంధించి నిందితులు, అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నారని తెలిపారు. మంగళవారం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద నిర్వహించిన తనిఖీలలో ఈ కేసులో ప్రధాన నిందితులు హనుమాన్ మెహిత్(27), సమీర్ సుధాకర్ గవాంది (29)లను గుర్తించి కిర్లంపూడి పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇదే ముఠాకు చెందిన అతుల్ ఓంకార్, సంజయ్ పాండురంగ, ఉమేష్ టాకిరే కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

రైతులకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 10 : రైతులకు ప్రతినెలా రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని రైతులకు ఏదైనా సమస్య వస్తే రైతులందరూ ఏకమై ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, రైతులకు వ్యతిరేకంగా ఏదైనా చట్టాలు తీసుకొస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని రైతు సంఘం తరపున హెచ్చరించారు. రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు బుధవారంతో ముగిశాయి. 35 తీర్మానాలను సభ ఆమోదించింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.రామచంద్రయ్య, అధ్యక్షుడిగా జి.ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏ.కాటమయ్య ప్రధాన కార్యదర్శిగా కేవీవీ ప్రసాద్, కార్యదర్శి, కోశాధికారిగా వలవలపూడి రాములను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎ.రామానాయుడు, వి.హనుమారెడ్డి, ఎం.యల్లమందరావు, కార్యవర్గ సభ్యులుగా డేగా ప్రభాకర్, కె.జగన్నాథం, వి.జమలయ్య, సి.మల్లికార్జున, బుడితి అప్పలనాయుడులతో కూడిన 21 మంది కార్యవర్గం, 58 మందితో సమితిని ఎన్నుకున్నారు. భూ యాజమాన్య హక్కుల చట్టం 2023ను రద్దు చేయాలని, కౌలు రైతుల చట్టాన్ని సవరించి సులభంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, రైతుల ఆత్మహత్యలు అరికట్టే రుణ ఉపశమన చట్టాన్ని తీసుకురావాలని సాగునీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలని, పోలవరం ముంపు ప్రజలను ఆదుకోవాలని, ఆక్వా రైతులకు రాయితీలు ఇవ్వాలని తదితర తీర్మానాలు చేశారు.

కారు ధ్వంసం..తప్పిన ప్రమాదం





యానాం, జవనరి 10: యానాం నియోజకవర్గంలోని ఫెర్రీ రోడ్డులో బీచ్ ప్రధాన రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా యువకులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. మచిలీపట్నానికి చెందిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఉండి శివలింగాల నుంచి ఎన్ఐసీ జెట్టీ వద్దకు ఓవర్‌స్పీడ్‌లో వచ్చి అటుగా వెళుతున్న కొంతమందిని తప్పించబోయి పక్కనే ఉన్న కరెంట్‌పోల్‌ను ఢీకొట్టారు. దీంతో కారు ముందు భాగం పూర్తిగా పాడై చక్రాలు విరిగిపోయాయి. ఆ సమయంలో కారులో ఉన్న ఇద్దరు సీటు బెల్టులు పెట్టుకుని ఉండటంతో బెలూన్స్ ఓపెన్ అవ్వడంతో ప్రాణాలతో బయటపట్టారు. ఈ సంఘటనలో ప్రాణనష్టం జరిగినప్పటికి కారు నుజ్జునుజ్జయ్యింది. విషయం తెలుసుకున్న యానాం ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకులతో మాట్లాడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిక్ బాక్సింగ్ ఎంపికలు



నిడదవోలు, జనవరి 10: నిడదవోలు పట్టణంలోని ఎస్వీఆర్కే డిగ్రీ కళాశాలలో బుధవారం ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం స్థాయిలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు కిక్ బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు జాతీయ విశ్వ విద్యాలయాల స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి తెలిపారు. ఈ పోటీలలో ఎం.రవి (ఎస్వీఆర్కే నిడదవోలు), బి.అర్జున్ (ఆదిత్య డిగ్రీ కాలేజ్ రాజమహేంద్రవరం), బి.ప్రవీణ్ కుమార్ (డీఆర్కే డిగ్రీ కాలేజ్, గొల్లల మామిడాడ), సీహెచ్ వెంకట్ (పీఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, కాకినాడ), బి.రవితేజ, (వీఎస్ఎమ్ డిగ్రీ కాలేజ్, రామచంద్రపురం), పి.ధనుష్ (పీఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, కాకినాడ), సీహెచ్ దినేష్ (గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, రాజోలు) క్రీడాకారులు ఎంపికయ్యారు.

భారీ భోగి దండ



ఆలమూరు, జనవరి 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో భారీ భోగి దండను తయారు చేశారు. 2019లో కిలోమీటరున్నర దండను తయారు చేసి రికార్డు సృష్టించారు. కొవిడ్ సమయంలో రెండేళ్లు సాధారణ దండలను తయారు చేశారు. గతేడాది కిలోమీటరు పొడవు రూపొందించారు. ఈ సంవత్సరం 600 మీటర్ల దండ తయారు చేశారు. ఉరదాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఈదల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవుపేడను చింతలూరు, గుమ్మిలేరు గ్రామాల నుంచి సేకరించి మహిళలు దీనిని తయారు చేశారు. భోగి పండుగ నాడు భారీ ఊరేగింపు నిర్వహించి భోగి మంటలో వేస్తామని నిర్వాహకులు చెప్పారు.

తునిలో టీడీపీ ప్రభంజనం

- రా కదలిరా సభకు తండోపతండాలుగా జనం
- మధ్యాహ్నం 12 గంటల నుంచే బాబు కోసం ఎదురుచూపులు


వేదికపై చంద్రబాబు, నాయకులు

తుని రూరల్, జనవరి 10: తునిలో టీడీపీ 'రా కదలిరా' సభ సూపర్ సక్సెస్ అయ్యింది. పార్టీ శ్రేణులు, అభిమానులు తండోపతండాలుగా తరలిరావడంతో నాయకుల ఆనందానికి అవధుల్లేవు. ఊహించని విధంగా జనప్రవాహం పోటెత్తడంతో తెగ సంబరపడిపోతున్నారు. సభా ప్రాంగణమంతా పసుపు మయంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు అందుకున్న కార్యకర్తలు ఉప్పెనలా తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే చంద్రబాబు ప్రసంగం కోసం ప్రజలు వేసి ఉండటం విశేషం. ఎక్కడ చూసినా పసుపు బ్యానర్లు, పసుపు తోరణాలు ఆకర్షించాయి. సభా వేదికకు కార్యకర్తలు తరలివచ్చే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టీడీపీ పార్టీ ఆర్చ్‌లు ఆకట్టుకున్నాయి. చామవరం శివారు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గం గుండా చంద్రబాబు సభాస్థలికి చేరుకునే మార్గంలో వేలాదిగా తరలివచ్చిన ప్రజలకు చంద్రబాబు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. టీడీపీ ఇన్‌చార్జ్ యనమల దివ్య, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్ గజమాలతో స్వాగతం పలికారు. ఆయన సభా వేదికకు చేరగానే ఈలలు, కేకలు, చప్పట్లతో పరిసరాలు మారుమోగాయి. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ చంద్రబాబుకు ధనస్సు బహూకరించగా, రాజమండ్రికి చెందిన మీసాల రాజు గదను అందజేశారు.

వైసీపీని గద్దె దించేందుకు సిద్ధం కావాలి

యనమల దివ్య, తుని టీడీపీ ఇన్‌చార్జ్

వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య తెలిపారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో 'రా కదలిరా' సభ రెట్టించిన ఉత్సాహం నింపినట్లు చెప్పారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడితే బీసీలకు రక్షణ చట్టం, మహిళలకు సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయని, పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో జనసేన, టీడీపీ ప్రభుత్వం వెలుగులు నింపుతుందన్నారు.

సాగునీటి కాలువలు నిర్వీర్యం అయ్యాయి

ఎస్వీఎస్ఎన్ వర్మ, పిఠాపురం ఇన్‌చార్జి

సైకో జగన్ పాలనలో సాగునీటి కాలువలు నిర్వీర్యం అయ్యాయని ఫలితంగా రైతులు దెబ్బతిన్నారని వర్మ ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలనలో రూ.1650 కోట్లతో పురుషోత్తపట్నం ప్రాజెక్టు అందుబాటులోకి తీసుకొస్తే వైసీపీ ప్రభుత్వం దాని నిర్వహణ చూడలేని పరిస్థితిలో ఉందన్నారు. రైతులు అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు ఇవ్వలేక తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోక రైతులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు.

కౌరవ సభను గౌరవంగా మార్చాలి

జ్యోతుల నవీన్‌కుమార్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు

రాష్ట్రంలో సైకో పాలన నడుస్తుందని ప్రజల కోసం అవమానాలు, నిర్బంధాలు భరించి ప్రజా శ్రేయస్సు కోసం తపిస్తున్న చంద్రబాబుకు అండగా నిలుద్దామని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలో సైకో పాలన ఉందని, అసెంబ్లీ కౌరవసభను తలపిస్తుందని దీన్ని గౌరవ సభగా మార్చేందుకు కాకినాడ పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని తెలిపారు.

అరాచక పాలనకు కాలం చెల్లింది

యనమల కృష్ణుడు, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

అవినీతి అక్రమాలు, అరాచకాలతో పేట్రేగిపోతున్న వైసీపీ పాలనకు కాలం చెల్లిందని రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసింది వైసీపీ ప్రభుత్వమేనని, అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని భావితరాల భవిష్యత్ టీడీపీ, జనసేనతో ముడిపడి ఉందన్నారు.

అడ్డగోలు హామీలతో రాష్ట్ర ప్రజలకు అష్టకష్టాలు

వనమాడి కొండబాబు,కాకినాడ సిటీ టీడీపీ ఇన్‌చార్జ్

అడ్డగోలు హామీలతో రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించింది ముఖ్యమంత్రి జగన్ అని కాకినాడ సిటీ టీడీపీ ఇన్‌చార్జ్ వనమాడి కొండబాబు అన్నారు. అందువల్ల ఈరోజు అంగన్‌వాడీలు, ఒప్పంద కార్మికులు, ఉపాధ్యాయులు రోడ్డెక్కిన పరిస్థితులు దాపురించాయన్నారు. సమస్యలు పరిష్కరించలేని జగన్ ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురి చేసే చర్యలకు పూనుకుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడి చంద్రబాబు అని ఆయనను కాపాడుకునే బాధ్యత అందరిపైన ఉందన్నారు.

కాటన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కామన్వెల్త్ నేషన్స్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్



అవార్డు ప్రదానం చేస్తున్న చైతన్యరాజు

రాజానగరం, జనవరి 10 : గోదావరి డెల్టా రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్‌ను నేటి యువ ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని కామన్వెల్త్ నేషన్స్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్ పిలుపునిచ్చారు. గైట్ ఇంజనీరింగ్ కళాశాలను బుధవారం ఆమె సందర్శించారు. చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన సమావేశంలో పేట్రీషియా స్కాట్లాండ్‌కు గైట్ కళాశాల నుంచి సర్ ఆర్థర్ కాటన్ ఇన్నోవేషన్ అవార్డ్-2023ను చైతన్యరాజు, ఎండీ శశికిరణ్‌వర్మ అందజేశారు. చైతన్య విద్యాసంస్థల ద్వారా ప్రతీ ఏటా 100 కామన్వెల్త్ స్కాలర్‌షిప్స్ ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నామని చైతన్యరాజు, శశికిరణ్‌వర్మ ప్రకటించారు. దీని ద్వారా కామన్వెల్త్‌లోని 56 దేశాలకు చెందిన మెరిట్ విద్యార్థులు చైతన్య విద్యాసంస్థల్లో విద్యనభ్యసించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాటన్ మేనకోడలు, కామన్వెల్త్ సెక్రటేరియట్ చీఫ్ డెబ్రామైఖేల్ గ్రేస్, సెక్రటరీ జనరల్ కార్యాలయ అధికారులు, ప్రొఫెసర్ ప్రజాపతి ద్వివేది, సునీల్ చంద్రరామ్, బర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా గార్‌ఉడ్ సెంటర్ ఫర్ కార్పొరేట్ ఇన్నోవేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సాల్మన్ డార్విన్, మేఘాలయ ప్రభుత్వ ప్రిన్సిపాల్ కార్యదర్శి సంపత్‌కుమార్, బెంగుళూరు క్రిస్ట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాజివర్గీస్, రొమానియా ఏఐ ఎక్స్‌పర్ట్ సాబిన్‌డామ, స్మార్ట్ విలేజెస్ డైరెక్టర్ వైఎస్ మైఖేల్, రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ తేజ్ భరత్, ఆర్డీవో చైత్రవర్షిణి, రాజానగరం తహశీల్దార్ పవన్‌కుమార్, సీఐ పి.కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం సందర్శన

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 10: చారిత్రాత్మక కాటన్ మ్యూజియాన్ని కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్ సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాకు వచ్చిన ఆమె బుధవారం నేరుగా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆమెకు జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, ఆర్డీవో చైత్రవర్షిణి తదితర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె కాటన్ మ్యూజియంలో బ్యారేజీ నమూనాలు, గోదావరి ప్రవాహ స్వరూపాన్ని పరిశీలించారు. అనంతరం కాటన్‌దొర జీవిత విశేషాలు, బ్యారేజీ చారిత్రక నేపథ్యాలను ఇరిగేషన్ అధికారులు ఎస్ఈ జి.శ్రీనివాసరావు, డీఈ కాశీవిశ్వేశ్వరరావు నుంచి ఆమె తెలుసుకున్నారు. కాటన్ బ్యారేజీకి ఐక్యరాజ్య సమితి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు ఇచ్చినట్టు జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ వివరించారు. ఈ సందర్భంగా పాట్రిసియా స్కాట్లాండ్ మాట్లాడుతూ చారిత్రక కలిగిన చిత్తరువులు వీక్షించడం తనకు ప్రత్యేక అనుభూతి కలిగిందన్నారు. ఆమె వెంట కాటన్ మేనకోడలు, కామన్వెల్త్ సెక్రటేరియట్ చీఫ్ డెబ్రామైఖేల్ గ్రేస్, ఎస్డీజీ ఇంప్లిమెంటేషన్ కార్యాలయ ప్రత్యేక ప్రతినిధి ప్రొఫెసర్ ప్రజాపతి ద్వివేది, బర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా గార్ ఉడ్ సెంటర్ ఫర్ కార్పొరేట్ ఇన్నోవేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సాల్మన్ డార్విన్, కేంద్ర యువజన విభాగం, కామన్వెల్త్ సెక్రటేరియేట్ సునీల్ చంద్‌రామ్, గైట్ చైర్మన్ కేవీ సత్యనారాయణరాజు, వైస్ చైర్మన్ కే శశికిరణ్‌వర్మ, ఎస్ఈజీ శ్రీనివాసరావు, డీఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, తహశీల్దార్ పి.చిన్నారావు ఉన్నారు.

కారు ఢీకొని వీఆర్ఏ దుర్మరణం



రాజానగరం, జనవరి 10: గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్న కొల్లాటి ప్రసాద్ (40) బుధవారం రాత్రి కారు ఢీకొనడంతో మరణించారు. రాజానగరంలో నివాసం ఉంటున్న ప్రసాద్ విధి నిర్వహణలో భాగంగా గోకవరం వెళ్లి మోటార్ సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యంలో రాజానగరం మండలం నందరాడ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఇండికా కారు ప్రసాద్‌ను బలంగా ఢీకొన్నది. వీఆర్ఏ హెల్మెట్ ధరించినప్పటికీ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జైలు దాడి కేసులో ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ షణ్ముగం

యానాం, జవనరి 10: యానాంలో సంచలనం కలిగించిన జైలు దాడి కేసులో పుదుచ్చేరి కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా ఉన్న 12 మందికి 7 సంవత్సరాలు జైలు శిక్ష విధించినట్లు యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముగం చెప్పారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పుదుచ్చేరిలో కరుడుకట్టిన నేరస్తుడు మణికంఠన్‌ను హత్య చేసేందుకు పుదుచ్చేరి నుంచి ప్లాన్ అమలు చేశారు. పుదుచ్చేరి జైలులో ఉన్న మణికంఠన్‌కు ప్రాణహాని ఉందని గ్రహించిన జైలు అధికారులు 2013లో భారీ భద్రతతో పుదుచ్చేరి నుంచి యానాం జైలుకు తరలించారు. యానాం జైలులో ఉన్న నేరస్తుడు మణికంఠన్‌ను హత్య చేసేందుకు 2013 ఆగస్టు 29న 18 మంది సభ్యులు బృందం యానాం జైలులోకి గోడ దూకి ప్రవేశించారు. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తక్షణం స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మూడు బృందాలుగా విడిపోయిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై అప్పటికే ఎస్ఐ, ప్రస్తుతం సీఐగా ఉన్న షణ్ముగం చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారిలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురిపై అభియోగాలు రుజువు కాకపోవడంతో మిగిలిన 12 మందిపై (పుదుచ్చేరికి చెందిన వారు) అభియోగాలు రుజువు కావడంతో వారికి పుదుచ్చేరి న్యాయస్థానం 7 సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. దీంతో వీరిని పుదుచ్చేరిలోని కాలపేట జైలుకు తరలించనున్నారని సీఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు.

నూతన నమూనాలయం భారీ స్థాయిలో అవసరం లేదు


సాంకేతిక సలహాదారుకు చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అన్నవరం, జనవరి 10: జాతీయ రహదారిపై నూతనంగా నిర్మిస్తున్న నమూనాలయం అంత భారీస్థాయిలో కట్టనవసరం లేదని దేవదాయశాఖ సాంకేతిక సలహాదారు కొండలరావు పేర్కొన్నారు. దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ అభ్యర్థన మేరకు బుధవారం రత్నగిరికి విచ్చేసి ఆజాద్ హయాంలో తీర్చిదిద్దిన రోడ్లను పరిశీలించారు. వనదుర్గ ఆలయం, మల్టీలెవెల్ కారు పార్కింగ్ తీర్చిదిద్దిన రోడ్డు, సీఆర్వో కార్యాలయం వద్ద నుంచి కొండ దిగువకు ఏర్పాటు చేసిన రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డుకు మరో పక్క రక్షణగోడ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అదే విధంగా పలుచోట్ల లోతు ఉండడంతో దానిని గ్రావెల్‌తో పూడ్చాల్సిన అవసరముందని అన్నారు. ఈ పరిశీలనపై లిఖితపూర్వక నివేదికను అందజేస్తామని దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేశారు. ముందుగా సత్యదేవుడిని దర్శించిన ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేయగా దేవస్థానం ఈఈ నరసింహారెడ్డి స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. సాంకేతిక సలహాదారు వెంట చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు ఉన్నారు.

సమ్మె బాటలో ఫీల్డ్ అసిస్టెంట్లు?

- 18కల్లా డిమాండ్లు పరిష్కరించకుంటే 19 నుంచి సమ్మె తప్పదని హెచ్చరిక


కూలీల హాజరు వేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు(ఫైల్)

మండపేట, జనవరి 10: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 18కల్లా డిమాండర్లు పరిష్కరించకుంటే 19 నుంచి సమ్మె తప్పదని వారు అంటున్నారు. గత పదేళ్ల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లగా పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం రూ.26000లు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లను బదిలీ చేయాలని, ప్రతిఏటా 7500 పని దినాలు విధానం రద్దు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం తమకు ప్రభుత్వం చెల్లిస్తున్న కనీస వేతనం రూ.5500 స్థానంలో రూ.26000 పెంచి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే తమ సమస్యలపై ఈ నెల 4న అమరావతిలో ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నామని చెప్పారు. అయితే ఈ నెల18 కల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యను పరిష్కరిస్తామని అధికారులు ఇచ్చిన హామీ నెరవేరకుంటే తాము కూడా ఈనెల 19 నుంచి సమ్మె బాట పడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాల్లో సుమారు 300 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన అంగన్వాడీ వర్కర్


సపర్యలు చేస్తున్న వర్కర్లు

రాజవొమ్మంగి జనవరి 10: రాజవొమ్మంగిలో బుధవారం అంగన్వాడీ వర్కర్లు 30వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా ఆర్అండ్‌బీ అతిథి గృహ సమీపంలో దీక్ష శిబిరం వద్ద నిరసన చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం లాగరాయి -1 అంగన్వాడీ టీచర్ కె.మంగ సొమ్మసిల్లి పడిపోవడంతో తోటి అంగన్వాడీ వర్కర్లు వెంటనే స్పందించి సపర్యలు చేశారు. అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం దిగిరాక తప్పదన్నారు.

డయల్ యువర్ డీఎంకి పలు సమస్యలు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 10: కాకినాడ ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఫోన్ చేసి పలువురు సమస్యలను వివరించారు. పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద అన్ని దూరప్రాంత సర్వీసులకు స్టాప్ ఇవ్వాలని, కాకినాడ ఆర్టీవో ఆఫీస్ మీదుగా సామర్లకోట, పిఠాపురం బస్సులు తిప్పాలని కోరారు. ఈ వినతులపై తగిన చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ వారికి వివరించారు.

'అగ్రి ల్యాబ్‌లతో రైతులకు నాణ్యమైన సేవలు'

సర్పవరం జంక్షన్, జనవరి 10: వరి, ఆక్వాసాగులో రైతులకు నాణ్యమైన సేవలందించేందుకు అగ్రి ల్యాబ్‌లు ఎంతగానో దోహద పడతాయని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. బుధవారం వాకలపూడి బీచ్‌లో సుమారు రూ. కోటి నిధులతో నిర్మించిన సమగ్ర వ్యవసాయ ప్రయోగశాల (అగ్రిల్యాబ్)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు విత్తనాల నాణ్యత, భూసార పరీక్ష, విత్తన శుద్ధి, పంట సమయంలో తీసుకోవాల్సిన ఆధునిక యాజమాన్య పద్ధతులపై శిక్షణ, పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం నియోజకవర్గానికో ల్యాబ్‌ని మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎంపీపీ గోపిశెట్టి పద్మజబాబ్జి, జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, ఫిషరీస్ ఏడీ కరుణాకరరావు, ఎఫ్‌డీవో ఉమామహేశ్వరరావు, సెక్రటరీ పిడుగు పాండు రంగారావు, కరీం భాషా, కర్రి చక్రధర్, నల్ల శ్రీను, గొల్లపల్లి జగన్ పాల్గొన్నారు.

'రక్తదానం సామాజిక బాధ్యత'

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 10: రక్తదానం చేయడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, రక్తదానంతో ఎందరో నిరుపేదల ప్రాణాలను కాపాడిన వారవుతారని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ అన్నారు. ఈనెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేద్కర్ స్మారక చిహ్నం, విగ్రహం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. వారి నుంచి 200 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ అధికారి డాక్టర్ సుగుణ, ఆదిత్య డిగ్రీ కాలేజీ సెక్రటరీ, ప్రిన్సిపాల్ నాయుడు,సూపర్‌వైజర్ బుజ్జిబాబు ఉన్నారు.

'పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి'

సర్పవరం జంక్షన్, జనవరి 10: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతీ పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని, విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కాకినాడ ఆర్డీవో, ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఇట్ల కిషోర్ తెలిపారు. బుధవారం నేమాం, పండూరు తదితర గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని.. వాటిలో విద్యుత్తు సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సౌకర్యం కోసం ప్రత్యేకంగా ర్యాంప్‌ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వీరవల్లి మురార్జీ, బీఎల్వోలు ఉన్నారు.

మంత్రి వ్యాఖ్యలపై న్యాయవాదుల నిరసన

పిఠాపురం, జనవరి 10: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలపై న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాక్టు రద్దు కోరుతూ విధులు బహిష్కరిస్తున్న న్యాయవాదులు పిఠాపురంలోని కోర్టుల వద్ద నిరాహారదీక్షలు కొనసాగించారు. బుధవారం వారు మాట్లాడుతూ ప్రజల ఆస్తిహక్కును హరించే ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై తెలుసుకోకుండా మంత్రి వాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ధర్మాన తక్షణం వాఖ్యలు ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు కొత్త సురేష్, జీ.సత్యనారాయణ, కొంగు నూకరాజు, కోడిగుడ్డు లోవరాజు, వినరపు భార్గవి పాల్గొనగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజారావు, కే.భాస్కర్, ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి గుదిమెళ్ల భాస్కరాచార్యులు, పీ.మూర్తి, బంగారు రామకృష్ణ పాల్గొన్నారు.

'అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు'

జగ్గంపేట, జనవరి 10: సంక్రాంతి పండుగ నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలందరికీ సీఐ లక్ష్మణరావు శుభాకాంక్షలు తెలిపారు. కోడిపందేలు, గుండాటలు, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని కోరారు. ముఖ్యంగా యువకులు మద్యం తాగి వాహనాలు అతివేగంగా నడిపి ప్రాణహాన్ని తెచ్చుకోవద్దన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జగనన్న ఇళ్ల స్థలాల స్వాధీనం

తాళ్లరేవు, జనవరి 10: కోరింగ పంచాయతీ సీతారామపురంలో జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు 675మందికి బుధవారం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ స్థలాలను స్వాధీనం చేశారు. తహశీల్దార్ ఎస్.పోతురాజు నేతృత్వంలో సర్వే అధికారులు లబ్ధిదారులకు ప్లాట్లలో సర్వే హద్దురాళ్లను చూపించి స్థలాలను అప్పగించారు. రాములవారిదొడ్డిలో 18మందికి రిజిస్ట్రేషన్ డ్యాకుమెంట్లు అందించారు. పాతకోరింగ, బొడ్డువానిలంక, కోలాటివారిపేట, ప్రతాప్‌నగర్, రంగనాయకపురం, పెదబొడ్డువెంకటాయపాలెంలో వాటర్‌ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీపీ రాయుడు సునీత, జడ్పీటీసీ శామ్యూల్‌సాగర్ పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, జనవరి 10: మండలంలోని పెద్దిపాలెంలో బుధవారం సెబ్ సీఐ పి.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది సారా బట్టీలపై దాడులు నిర్వహించి 800లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అదే గ్రామంలో 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఎదురి అప్పన్నదొర అనే వీరబాబుపై కేసు నమోదు చేశారు. కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురంలో గుబ్బల ఆదినారాయణను 15లీటర్ల సారాతో అరెస్ట్ చేశారు. సెబ్ ఎస్‌ఐ బి.శ్రీనివాసరావు, సిబ్బంది కృష్ణార్జున, వెంకన్నదొర, రాంబాబు, దొరబాబు పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

ప్రత్తిపాడు, జనవరి 10: ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో పగటివేష కళాకారులను విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు సన్మానించారు. తాడేపల్లిగూడెనికి చెందిన పగటి వేశ కళాకారులు ఎడవల్లి లోవరాజు, నాగరాజును వారు అభినందించారు. వీహెచ్‌పీ ప్రముఖ్ ఆలమూరి సుబ్బారావు, అడపా శివ, ఆకుల సూర్యప్రకాష్, అడపా వీరభద్రం, లొల్ల మంగాదేవి, పిల్లా రాంబాబు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

గండేపల్లి, జనవరి 10: పొలాల్లో సాగునీటి బోరుల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లను ఇటీవల గుర్తుతెలియని దుండగలు దోచుకుపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురికాకుండా గండేపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం రైతులకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. చోరీలు ఎలా జరుగుతున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. చోరీలను నిరోధించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏఎస్‌ఐ శేఖర్, విద్యుత్ అధికారులు ఉన్నారు.

అంగన్‌వాడీల భిక్షాటన

కొత్తపల్లి, జనవరి 10: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్న విషయం విదితమే. సమస్యలపై ప్రభుత్వం దున్నపోతు వైఖరికి నిరసనగా కొత్తపల్లి మండలంలో పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీలు రోడ్డెక్కి భిక్షాటన చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఎన్నికల హామీల్లో భాగంగా వేతనాలు పెంచుతామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

పలుచోట్ల ఆడుదాం ఆంధ్ర పోటీలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 10: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలను ఎంపీడీవో డీఎల్ఎస్.శర్మ, సర్పంచ్ లోవతల్లి, ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, ఓరుగంటి చక్రధర్ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు ఎవ్వరు రాకపోవడంతో ఆటలు ఆడుతున్న క్రీడాకారులు అక్కడక్కడ వాటిని వీక్షిస్తూ కనిపించారు.

సామర్లకోట: మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో డి.శ్రీలలిత ఆధ్వర్యంలో ఎంఈవోలు శివరామకృష్ణయ్య, పుల్లయ్య పర్యవేక్షణలో సామర్లకోట ప్రభుత్వ కళాశాల మైదానంలో ప్రారంభమైన కబడ్డీ, ఖోఖో పోటీల్లో క్రీడాకారులను దవులూరి సుబ్బారావు, ఎంపీపీ బి.సత్తిబాబు పరిచయం చేసుకున్నారు. అచ్చంపేటలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎలిశెట్టి నరేష్, వ్యాయామోపాధ్యాయులు తదితరులున్నారు.

కరప: కరప నక్కా సూర్యనారాయణ మూర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ప్రారంభించారు. ఎంపీడీవో కె.అప్పారావు పాల్గొన్నారు. కరప, పెద్దాపురప్పాడు హైస్కూలులో క్రికెట్, వేళంగి, గురజనాపల్లి, కరప, పెద్దాపురప్పాడు హైస్కూళ్లలో కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: సలార్, డెవిల్ బబుల్‌గమ్, యానిమల్, హాయ్ నాన్న

తిరుమల	:	డెవిల్
లక్ష్మి	:	డెవిల్
సీ అండ్‌సీ1	:	కపాలదీవి
సీ అండ్‌సీ2	:	సలార్
శ్రీప్రియ	:	పిండం
పద్మప్రియ	:	యానిమల్
సత్యగౌరి	:	పిండం
సూర్య 1	:	డెవిల్
సూర్య 2	:	సలార్

జనసేన భవిష్యత్తుకు హామీ కార్యక్రమం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 10: భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్తుకు హామీ యాత్ర కార్యక్రమాన్ని తుమ్మలపల్లి సీతారామ్ ఆధ్వర్యంలో 44వ డివిజన్‌లో బుధవారం నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన పొత్తుతో అధికారం చేపట్టిన తర్వాత పరిష్కరిస్తామని హామీఇచ్చారు. కోరం చిరంజీవి, రావిపాటి వెంకటేశ్వరరావు, కైలాసం వెంకటఆదినారాయణరావు పాల్గొన్నారు.

తునికి తరలిన టీడీపీ శ్రేణులు

రా కదలి రా.. సభకు బస్సులు, కార్లు, బైక్‌లపై వెళ్లిన నాయకులు, కార్యకర్తలు



కాకినాడలో బస్సులను ప్రారంభిస్తున్న కొండబాబు



జగ్గంపేట నుంచి కార్లలో వెళ్తున్న టీడీపీ శ్రేణులు

కాకినాడ సిటీ, జనవరి 10: రా కదలి రా.. నినాదంతో బుధవారం తునిలో ఏర్పాటు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభకు కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో బస్సులు, కార్లు, బైక్‌లపై పార్టీ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. మాజీ ఎమ్మె ల్యేలు కొండబాబు, అయితాబత్తుల ఆనందరావు, నియోజకవర్గ పరిశీలకులు నాగిడి నాగేశ్వరరావు, మెట్ల రమణబాబు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో కోనసీమ టీడీపీ మహిళాధ్యక్షురాలు పెచ్చేటి విజయలక్ష్మి, పార్టీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఎంఏ తాజుద్దీన్, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, అమన్‌జైన్, నల్లారి శ్రీనివాస్, సంగాని చిన్ని ఉన్నారు.

సర్పవరం జంక్షన్: తుని బహిరంగ సభకు గొడారిగుంట నుంచి జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ ఆధ్వర్యంలో సుమారు 150 నాలుగు చక్రాల వాహనాలు, కారుల్లో బైక్‌లపై జన సైనికులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సర్పవరం జంక్షన్ నుంచి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, జిల్లా ఉపాధ్యక్షుడు పేరాబత్తుల రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి బాబీ, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు, పార్టీ రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో సుమారు 250 వాహనాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ ర్యాలీని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, రూరల్ పరిశీలకులు కుడుపూడి సత్తిబాబు జెండా ఊపి ప్రారంభించారు. వాకలపూడి నుంచి మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతుల ఆధ్వర్యంలో సుమారు 150 నాలుగు చక్రాల వాహనాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. టీడీపీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

జగ్గంపేట: తునిలో చంద్రబాబు భారీ బహిరంగ సభ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో జగ్గంపేట నుంచి 100 బస్సులు, 150 కార్లు, 185ఆటోలు, 500 బైక్‌లతో ప్రోగ్రాం కన్వీనర్ నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బురుగుపల్లి శేషారావు, నియోజకవర్గ పరిశీలకులు శీలం వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పది వేల మంది భారీ జన సందోహంతో భారీ ర్యాలీగా తరలివెళ్ళారు. మండలాధ్యక్షులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

పిఠాపురం: నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, మండలాల నుంచి వెళ్తున్న ఆటోలు, బస్సులు, కార్లు, ఇతర వాహనాలను వర్మ జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సామర్లకోట: తునికి బయలుదేరిన తెలుగుతమ్ముళ్లు



కోటనందూరు: తునికి తరలివెళ్తున్న టీడీపీ నేతలు



చంద్రబాబుకు వర్మ వినతి

పిఠాపురం నియోజకవర్గ సమస్యలపై చంద్రబాబుకు వివరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వర్మ – పిఠాపురం

గండేపల్లి: గండేపల్లి మండలం నుంచి టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో సుమారు 25కార్లు, 30కి పైగా బస్సుల్లో కార్యకర్తలు, అభిమానులు తునిలో బహిరంగ సభకు తరలివెళ్లారు.

పెద్దాపురం: పట్టణ, రూరల్ గ్రామాల నుంచి భారీగా టీడీపీ శ్రేణులు పలు వాహనాల్లో సుమారు రెండు వేలమందికి పైగా తునికి తరలివెళ్లారు. కాండ్రకోట గ్రామం నుంచి టీడీపీ నేత ఎలిశెట్టి నాని ఆధ్వర్యంలో పలు వాహనాల్లో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. టీడీపీ నేతలు మేడిది శ్రీనివాస్, రాగాల ఉమామహేశ్వరరావు, ఏలేటి సుబ్బారావు, అడపా గంగాధర్ ఉన్నారు.

సామర్లకోట: మండలంలో అన్ని గ్రామాల నుంచి టీడీపీ కార్యకర్తలు, నాయకులు వాహనాల్లో టీడీపీ జెండాలతో ప్రదర్శనగా తరలివెళ్ళారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ ఆధ్వర్యంలో అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహం నుంచి వాహనాలు ప్రదర్శనగా తరలివెళ్లారు. టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనుబాబు, గుమ్మళ్ళ రామకృష్ణ, ఆకునూరి సత్తిబాబు, కుర్రా నారాయణ స్వామి, చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, అడ్డాల వెంకన్నబాబు, చల్లా బుజ్జి తునికి వెళ్లారు.

కోటనందూరు: మండల గ్రామాల నుంచి టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో 100 బైక్‌లు, 300 ఆటోల్లో తరలివెళ్లారు. అంకంరెడ్డి రమేష్, పేంటకోట భాస్కరసత్యనారాయణ, లేక్కల భాస్కర్, షేక్ నవాబ్‌జానీ, పి.నాగేశ్వరరావు, గెడ్డం కొండ య్యనాయుడు, రుత్తల శ్రీనివాస్, పోతల సూరిబాబు ఉన్నారు.

రౌతులపూడి: మూలగపూడి నుంచి టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీటీసీ యామల సురేష్, రౌతులపూడి నుంచి మాజీ ఎంపీపీ ఇంటశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ సర్పంచ్ పైలా సాంబశివరావు, గంటా గోపి, అల్లు బుజ్జి, రాజవరం నుంచి చింతకాయల రాజు, బలరామపురం నుంచి మాజీ సర్పంచ్ పైల పైడిరాజు, ఎంపీటీసీ సోమరౌతు రవి, గుమ్మరేగుల నుంచి పసగడుగుల రమణ, ఉప్పంపాలెం నుంచి రాము, రాజా, చినబాబు, ఎస్.పైడిపాల నుంచి మాజీ సర్పంచ్‌లు ఈగల సత్తిబాబు, గోల్లు పెద్దదివాణం, ఎ.మల్లవరం నుంచి లెక్కల రాము, పల్లికుమార్, గుడివాడ గురునాథ్ తునికి తరలి వెళ్లారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల నుంచి టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఏలేశ్వరంలో 120ఆటోలు, 20కార్లలో కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూదినారాయణస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని రాష్ట్ర బీసీ ఫెడరేషన్ కార్యదర్శి ఏలేశ్వరం మండల అబ్జర్వర్ వాసంశెట్టి సత్య ప్రారంభించారు. పార్టీ నాయకులు పెండ్ర శ్రీను, కోనాల వెంకటరమణ, వైభోగుల సుబ్బారావు, ఎండగుండి నాగబాబు, పాల్గొన్నారు. ధర్మవరం నుంచి అమలాపురం పార్టీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణ నాయకత్వంలో కార్యకర్తలు, అభిమానులు కార్లలో తుని బయల్దేరి వెళ్లారు.

కిర్లంపూడి: టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు బస్సులు, కార్లు, ఆటోలు, బైక్‌లపై వెళ్లారు.

దారులన్నీ తుని వైపే

తుని రూరల్, జనవరి 10: తునిలో జరిగిన రా కదలిరా బహిరంగ సభకు కాకినాడ పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణుల వాహనాలు తుని వైపునకు దారి తీశాయి. పెద్ద ఎత్తున కార్యకర్తలతో తరలివచ్చిన బస్సులు, కార్లు, ఆటోలతో తుని జాతీయ రహదారి, పార్కింగ్ ప్రదేశాలు కిక్కిరిశాయి. సభాప్రాంగణం వద్దకు వెళ్లేందుకు వీలులేకపోవడంతో వేలాది మంది ట్రాఫిక్‌లోనే ఇరుక్కుపోయారు. చంద్రబాబు ప్రసంగం అనంతరం సభ ముగించడంతో సభా ప్రాంగణం నుంచి ఒక్కసారిగా వచ్చిన జనంతో జాతీయ రహదారిలోని ప్రధాన కూడళ్లలో రద్దీ నెలకొంది. తునిపట్టణ నుంచి గవర య్య కోనేరు వరకు వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు, టీడీపీ, జనసేన వలంటీర్లు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాకపోకలు సజావుగా జరిగేందుకు పని చేశారు.

భారీ సభావేదిక

రా కదలిరా సభలో ఏర్పాటు చేసిన భారీ సభావేదిక అందరినీ ఆకట్టుకుంది. 7 నియోజకవర్గాల నుంచి హాజరైన ప్రముఖ టీడీపీ, జనసేన నాయకులందరినీ ఆశీనులు అయ్యే విధంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. జనసేన, టీడీపీ నాయకులు పంతం నానాజీ, తంగెళ్ల ఉదయశ్రీనివాస్, వరుపుల తమ్మయ్యబాబు, పిల్లి అనంతలక్ష్మి, మహాసేన రాజేష్, చిక్కాల రామచంద్రరావు, సానా సతీష్‌బాబు, యనమల శివరామకృష్ణన్, యనమల కృష్ణుడు, నామన రాంబాబుతో పాటు పలువురు వేదికపై ఆశీనులయ్యారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి

శంకర్ నాయక్‌కు గిరిజనుల విన్నపం



గిరిజన మహిళ గోడు వింటున్న శంకర్‌నాయక్

ప్రత్తిపాడు, జనవరి 10: సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో నిర్వహిస్తున్న మైనింగ్ కార్యకలాపాల నేపథ్యంలో ప్రభుత్వానికి వచ్చే మైనింగ్ ఆదాయంతో గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని పలువురు గిరిజనులు ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్‌కు విన్నవించారు. మండలంలోని వంతాడ, పొదురుపాక, పాండవులపాలెం గిరిజన గ్రామాల్లో బుధవారం 2వ రోజు ఆయన పర్యటించారు. గిరిజనులు కులధ్రువీకరణ పత్రాలకు పడుతున్న ఇబ్బందులను నాయక్ దృష్టికి తెచ్చారు. అలాగే గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, గృహనిర్మాణం, కొండపోడు పట్టాలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సత్వరం అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి ఎ.విజయశాంతి, తహశీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో కుమార్‌బాబు, ఎస్‌ఐ ఎం.పవన్‌కుమార్, ఎంఈవో వి.రాజబాబు, ఏపీఎం ఇనుగంటి వెంకట్రావు, ఏపీవో కుమారస్వామి, హౌసింగ్ ఏఈ అత్తిలి ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీరాం, ఎంఈవో వి.రాజబాబు పాల్గొన్నారు.

పంటనష్టాల నమోదులో నిర్లక్ష్యం

మండల పరిషత్ సమావేశంలో ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గీత

పిఠాపురం రూరల్, జనవరి 10: పంటనష్టాల నమోదులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యక్షత వహించగా కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.ప్రత్తిపాడు సర్పంచ్ ఊటా కృష్ణ తదితరులు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో రైతాంగానికి కోలుకోలేని దెబ్బ తగిలిందని, తుపాన్‌తో అన్ని విధాల నష్టపోయారని తెలిపారు. నిబంధనల పేరిట అధికారులు నష్టాలను సరిగా నమోదు చేయలేదని రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అంతకు ముందు జరిగిన బడ్జెట్ సమావేశంలో రూ.64,900 మిగులుతో రూపొందించిన 2023-24 అంచనా బడ్జెట్‌కు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ వ్యవసాయ పనులను జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. దీనిపై కేంద్రాన్ని కోరామని తెలిపారు. ఉపాధి పథకం ద్వారా పూలతోటల పెంపకానికి నిధులు ఇస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లినగర్‌లో అగ్నిప్రమాదం

జగ్గంపేట, జనవరి 10: మండలంలోని రామవరం గ్రామం రంగవల్లినగర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం రాత్రి 7 తాటాకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. పూరి గుడిసెల్లో ఉన్న ప్రజలకు ప్రాణనష్టం జరలేదు కానీ ఆస్తి నష్టం తీవ్రంగా జరిగింది. ఫైర్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. నష్టంపై అంచనా వేసి ఈ సంఘటనకు గల కారణాలను పూర్తిస్థాయిలో తెలుపుతామని చెప్పారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



సర్పవరం జంక్షన్ : అక్కూలో సంబరాల దృశ్యాలు



సర్పవరం జంక్షన్, జనవరి 10: కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్కూ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో బుధవారం ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చాటిచెప్పేందుకు సంక్రాంతి సంబరాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. పీజీ విద్యార్థులు రంగవల్లుల పోటీలు, భోగిమంటలు, భోగిపళ్ల, గొబ్బెమ్మలు, పతంజలి, గంగిరెద్దులు విన్యాసాలు పోటీలు ఆకట్టుకున్నాయి. మహిళా విద్యార్థులు రోకళ్లతో ధాన్యాన్ని దంచి పరవాణ్ణం తయారు చేశారు. మినపగుళ్లను తిరగలిపై ఆడించి సున్నిఉండలు తయారు చేశారు. హరిదాసు, బుడబుక్కల వాళ్లు, కొమ్మలదాసరి, సోదెమ్మ, కృష్ణుడు వంటి సంప్రదాయ వేషధారణాలు, కోలాటం, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లరేవు: కోరింగ ఫార్మసీ కళాశాల, పాఠశాల, కైట్ ఇంజనీరింగ్ కళాశాల, పాఠశాల, సత్యసాయి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి కోలాటం, పిండి వంటలు చేశారు. భోగిమంటలను వెలిగించారు. కళాశాల యాజమాన్యం పి.కనకరాజు, చిట్టూరి కలికిమూర్తి, చైర్మన్ దున్నాజనార్ధనరావు, వై.రామకృష్ణ, కరస్పాండెంట్ పట్టా ఆదినారాయణవర్మ ఉన్నారు.

సామర్లకోట: సామర్లకోట ప్రతిభ విద్యాసంస్థల ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యాసంస్థ డైరెక్టర్ ఎస్వీప్రకాష్, లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ సుధారాణీ పాల్గొన్నారు. పలు వేషధారణలు ఆకట్టుకున్నాయి.

కొత్తపల్లి: కొమరగిరి శివారు వెంకటరాయపురంలో ఏర్పాటుచేసిన భోగి మంటను సర్పంచ్ డాక్టర్ సత్యశ్రీ, ఉపాధాయిని పద్మావతి వెలిగించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు. కొత్తపల్లి వీవీఎస్ విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాల్లో భోగిమంట వెలిగించారు.

కరప: వలసపాకల, వేములవాడ, పెదకొత్తూరు, వేళంగి, కూరాడ, సిరిపురం గ్రామాల్లో జగనన్న సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎంఈవో-1 కె.బుల్లికృష్ణవేణి గ్రామాల్లో పర్యటించి వీడీలు, సచివాలయ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. సర్పంచ్ వాసంశెట్టి రామారావు, కమిడి మంగాదేవి, అడబాల సత్య విజేతల్ని ప్రకటించారు.



కొత్తపల్లి: కొమరగిరిలో భోగి మంట వెలిగింత



మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘ ప్రతినిధులు

'నష్టపరిహారం చెల్లించాలి'

కోనపాపపేట (కొత్తపల్లి), జనవరి 10: తీరప్రాంతంలో ఏర్పాటుచేస్తున్న పరిశ్రమల కారణంగా వ్యర్థాలు సముద్రంలో కలిసిపోవడం వల్ల జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించాలని కోనపాపపేట మత్స్యకారుల సంఘ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. స్థానిక వాడబలిజరామాలయంలో శుక్రవారం జరిగిన మత్స్యకారుల సమావేశంలో పలువురు పెద్దలు పాల్గొన్నారు. ఇప్పటికే పలు పరిశ్రమలకు చెందిన వ్యర్థాలు సముద్రంలోకి విడుదల చేయడం వల్ల మత్స్య సంపద క్రమేపీ అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో సముద్రంలో చేపలు లభ్యమయ్యేపరిస్థితి లేదని, సంబంధిత పరిశ్రమల నిర్వాహకులు ఉపాధి లేక నష్టపోతున్న మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో యువకుడికి జైలుశిక్ష

సర్పవరం జంక్షన్, జనవరి 10: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారునికి ఒక రోజు జైలు శిక్ష న్యాయమూర్తి విధించినట్టు సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతున్నట్టు గుర్తించామన్నారు. వారిని కోర్టులో హాజరుపరచగా ఇద్దరికీ తలో రూ.10వేలు జరిమానా, ఒకరికి ఒక రోజు జైలు శిక్ష విధించారని ఆయన చెప్పారు.

'ఆదిత్య' విద్యార్థికి అవార్డు

గండేపల్లి, జనవరి 10: జేఎన్టీయూకే అంతర్ కళాశాలల బెస్ట్ ఫిజిక్ పోటీల్లో సూరంపాలెంలోని ఆదిత్య విద్యాసంస్థల్లో సివిల్ చివరి సంవత్సర విద్యా ర్థి ఎన్.రోహిత్ ఉత్తమ అవార్డును సాధించాడు. కేరళలో కాలికట్ వర్సిటీలో నిర్వహించే అఖిల భారత అం తర యవర్సిటీ పోటీల్లో రోహిత్ పాల్గొంటాడు. ఈ విద్యార్థిని ఆదిత్య విద్యాసంస్థల వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, కోచ్ సాయికిషోర్ అభినందించారు.

ఆర్‌జేడీ కార్యాలయం ముట్టడికి మున్సిపల్ కార్మికులు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 10: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో చలో రాజమండ్రి ఆర్‌జేడీ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా కాకినాడ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, కాకినాడ కమిటీ సభ్యులు చలో రాజమహేంద్రవరానికి బయలుదేరారు. ఈ సందర్భంగా తోకల ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల పట్ల సీఎం జగన్ నిర్లక్ష్య వైఖరి మానుకోవాలని, సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, జీతాలు పెంచాలని కోరారు. పారిశుధ్య కార్మికుల సమస్యలపై స్పందించని ప్రజాప్రతినిధులకు ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. హరిబాబు, ములికి సత్యనారాయణ, జనిపల్లి అప్పన్న పాల్గొన్నారు.



కార్యాలయ ముట్టడికి బయలుదేరిన కార్మికులు

ముద్రగడను కలిసిన జనసేన నాయకులు

కిర్లంపూడి, జనవరి 10: కిర్లంపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభ స్వగృహంలో జనసేన పార్టీ నాయకులు కలిశారు. తాడేపల్లిగూడెం జనసేన ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ మరో 14 మంది నాయకులు ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ముద్రగడ ఆహ్వానించి అల్పాహారం ఇచ్చారు. తర్వాత వారు ఏకాంతంగా మాట్లాడుకున్నారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు, జనవరి 10: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. బుధవారం ఆలయంలో కొలువైన ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వకంగా 11రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ సేవాకమిటీ సభ్యులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

దోమల మందు పిచికారీ

పెదపూడి, జనవరి 10: లయన్స్‌క్లబ్ శ్రీసూర్య ఆధ్వర్యంలో జీ.మామిడాడలో డ్రైనేజీల్లో దోమలమందు పిచికారీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో దోమల బెడద అధికంగా ఉండడంతో తమ వంతు సాయంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నార. ఆర్థికంగా సహకరించిన క్లబ్‌సభ్యులకు కార్యదర్శి ద్వారంపూడి యువరాజారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ సభ్యులు ద్వారంపూడి భాస్కరరెడ్డి, సబ్బెళ్ళ మోహనరెడ్డి, చత్రపతి శివాజీ ఉన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

కోటనందూరు, జనవరి 10: బిళ్లనందూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే, సచివాలయం నూతన భవనాలను రహదారులు, భవనాలు శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. సర్పంచ్ బొచ్చా సత్తిబాబు లక్ష్మి, ఎంపీపీ లవుడు శ్రీనువాస్, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లు అచ్చియ్యనాయుడు, గొర్లు రామచంద్రరావు పాల్గొన్నారు.